### నియామకం

ఇచ్చోడ, అక్టోబర్ 22 : నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోకసమన్నూర్ గ్రామానికి చెందిన పట్ల గోవర్ధన్ నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

### రూమ్ టూ రీడ్ సంస్థ కృషి అభినందనీయం

ఇచ్చోడ, అక్టోబర్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచడానికి రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని డీఈవో ప్రణీత అన్నారు. మంగళవారం సిరికొండ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో సునీల్, ప్రధానోపాధ్యాయుడు గంగారాం, రూమ్ టూ రీడ్ జిల్లా ఇన్చార్జి శ్రీకాంత్, మండల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎదులాపురం, అక్టోబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో అఖిల పక్ష రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలంలో రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేయలేదన్నారు. కాబట్టి వెంటనే రైతు భరోసా చెల్లించి ప్రతి రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు బండి దత్తాత్రి, దేవర్తి స్వామి, రమేశ్, నారాయణ, వామన్ పాల్గొన్నారు.

### ఎస్ ఆర్ శంకరన్ జయంతి వేడుకలు

ఎదులాపురం, అక్టోబర్ 22 : సివిల్ సర్వీస్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పని చేసి దళితులకు, గిరిజనులకు భూ హక్కులు కల్పించిన నిస్వార్థ సేవకుడు ఎస్ఆర్ శంకరన్ 80వ జయంతిని మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, అశోక్, ఊశన్న, సుధీర్, రాఘవేంద్ర, అర్జున్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22: నిర్మల్‌లోని ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ 1 పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

### టార్పాలిన్లు పంపిణీ

సారంగాపూర్, అక్టోబర్ 22: సారంగాపూర్‌లోని మార్కెట్ కార్యాలయంలో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ దుముడ నాయక్, రైతులు పాల్గొన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెంబి, అక్టోబర్ 22: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మణ్ సూచించారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

### మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

కుభీర్, అక్టోబర్ 22: కుభీర్ మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం నిర్మల్ జిల్లా పరిషత్ సీఈవో గోవింద్ తనిఖీ చేశారు. క్యాష్ బుక్‌తో పాటు పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఎస్ఏ రహమాన్, సిబ్బంది ఉన్నారు.

### పనులు త్వరగా పూర్తి చేయాలి

సోన్, అక్టోబర్ 22: సోన్‌లో నిర్మిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పనులు చివరి దశలో ఉన్నందున నాణ్యతగా, త్వరగా వారంలోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట డీఈ గంగాధర్‌గౌడ్, ఏఈ అంజనేయకుమార్ ఉన్నారు.

### గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు

సారంగాపూర్, అక్టోబర్ 22 : యాకరుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది రమణ, వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

లక్ష్మణచాంద, అక్టోబర్ 22: రాచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధిక, మండల వ్యవసాయాధికారి వసంత్, రైతులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాటం చేస్తా

సారంగాపూర్, అక్టోబర్ 22 : నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాటం చేసి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం, జామ్ నుంచి బోరింగ్‌తండా వరకు రూ. 3.20కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, పీఆర్ఈఈ శ్రీనివాస్‌రావు, పీఆర్ డీఈ తుకారాం, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఏపీవో లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, ఆలూర్ పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్ పాల్గొన్నారు.

### కుమ్రం భీం ఆశయసాధనకు పాటుపడాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22: కుమ్రం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని చైన్‌గేట్ వద్ద గల భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా కుమ్రం భీం జయంతి

దిలావర్‌పూర్/దస్తురాబాద్/ఎదులాపురం/ ఉట్నూర్ రూరల్/నర్సాపూర్(జీ),అక్టోబర్ 22 : దిలావర్‌పూర్ మండలం న్యూలోలం, దిలావర్‌పూర్, దస్తురాబాద్ మండలం గొడిసేర్యాల గొండుగూడెం(జీ), కడెం, ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి, నర్సాపూర్ (జీ) నందన్ గ్రామాల్లో, ఆదిలాబాద్‌లో కుమ్రం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. న్యాయక్ పోడు సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, తుడుందెబ్బ దస్తురాబాద్ మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, టీఏజీఎస్, కాంగ్రెస్ నాయకులు, న్యాయక్‌పోడ్ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి మల్లేశ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీశ్ రెడ్డి, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు పాల్గొన్నారు.

## సమాజశ్రేయస్సే పోలీసుల లక్ష్యం



ఖానాపూర్ టౌన్: ఆయుధాల గురించి వివరిస్తున్న సీఐ సైదరావు

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 22: సమాజ శ్రేయస్సు, ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల లక్ష్యమని ఖానాపూర్ సీఐ సైదరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, బాధ్యతలు, ఫిర్యాదులు, కేసు పెట్టడం, శాంతి భద్రతల పరిరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. ఆయుధాలు పనితీరు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, ఆయా పాఠశాలల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్, అక్టోబర్ 22 : బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆయుధాలపై సీఐ రమేశ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసా, అక్టోబర్ 22 : సమాజ శ్రేయస్సే పోలీసుల అంతిమ లక్ష్యమని పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు. భైంసాలోని పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, పోలీసులు చేసిన ప్రతిభ త్యాగాల గురించి వివరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కొవ్వొత్తుల ర్యాలీ

నర్సాపూర్(జీ), అక్టోబర్ 22 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రజలు మరువద్దని ఎస్ఐ హన్మాండ్లు అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. బస్టాండ్ వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫసి, ఏఎస్ఐ మాన్సింగ్, హెడ్ కానిస్టేబుల్ అన్వర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న అల్లెపు రామకుమారి

ఇచ్చోడ, అక్టోబర్ 22 : ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన అల్లెపు సంధ్య-రాములు దంపతులది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. అల్లెపు రాములు పొట్టకూటి కోసం ఎడారి దేశానికి వలస వెళ్లి కూలీ పని చేస్తున్నాడు. సంధ్య ఇంటి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నది. వీరికి ముగ్గురు సంతానం అందులో పెద్ద కూతురు అల్లెపు రామ కుమారి(12)కు బ్రెయిన్ ట్యూమర్‌తో నిజామాబాద్ చికిత్స పొందుతున్నది. చేతులో ఉన్న డబ్బు అంతా చికిత్స కోసం ఖర్చు అయిపోయింది. పాప ప్రాణపాయ స్థితిలో ఉంది. మెరుగైన చికిత్స కోసం రూ.4 లక్షల వరకు అవసరం ఉందని వైద్యులు సూచించారు. పాప ప్రాణాలను కాపాడడంలో మనవంతు సహాయం అందిద్దాం. దాతలు రాపన్ శేఖర్ 8897055267 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానిది నయా పైసా లేదు..

తాంసి, అక్టోబర్ 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో రూ.75 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో కలిసి మంగళవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో రూ.75 లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వానిది నయా పైసా లేదని అన్నారు. అనంతరం పాఠశాలలో నెలకున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు మంత్రిగా నగేశ్ ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మాజీ సర్పంచ్ స్వప్న, డీఈ సతీశ్, జేఈఈ శేఖర్, నాయకులు వినోద్ రెడ్డి, మహేందర్, రఘు, అరుణ్‌కుమార్, అశోక్, రజినీకాంత్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, చంద్రన్న, ప్రిన్సిపల్ సంతోష్ పాల్గొన్నారు.

**ఎంఈవోపై ఎమ్మెల్యే ఆగ్రహం..**

మండల కేంద్రంలో ఎమ్మెల్యే పర్యటించే క్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసి రోడ్డుపై చేతులు శుద్ధి చేస్తున్న క్రమంలో గమనించిన ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి శ్రీకాంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు రోడ్డు మీదకు వచ్చి చేతులు కడగడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై స్పందించిన ఎంఈవో శ్రీకాంత్ పాఠశాలలో బోరు రిపేరు కావడంతో ఇలా పిల్లలు బయటకు వచ్చి కడుగుతున్నారని సమాధానం ఇచ్చారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు. పాఠశాలలో నీటి సమస్య రాకుండా బోరు వేయించాలని సదరు అధికారికి ఆదేశించారు.

# రోడ్డు పనులు కొనసాగించాలి



ఇచ్చోడ: మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, అక్టోబర్ 22 : రోడ్డు పనులు యథావిధిగా కొనసాగించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అధికారులకు సూచిచారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, నాయకులు సుభాష్ ఉన్నారు.

**సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఎమ్మెల్యేతో విద్యార్థి మొర..**

తాంసి, అక్టోబర్ 22: తాంసిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగ విద్యార్థి వర్ష తనకు సదరం సర్టిఫికెట్ అధికారులు ఇవ్వడం లేదు సార్ అంటూ బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో మొర పెట్టుకుంది. ఆన్‌లైన్‌లో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న జీరో పర్సంటేజ్ ఇస్తున్నారని ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయింది. విద్యార్థికి సదరం సర్టిఫికెట్ అందించి పింఛన్ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

బజార్‌హత్నూర్, అక్టోబర్ 22: బజార్‌హత్నూర్‌కు చెందిన శ్రీహరి, భగత్ వినోద్, పడిపెల్లి పోతన్న, ముత్యాపువార్ మాధవ్, సూర్యవంశీ, లక్ష్మీబాయితో పాటు వర్తమన్నూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తల్లి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం, నాయకులు భూమయ్య, విలాస్, రమణ, జనార్దన్, సాయన్న, విద్యాసాగర్ ఉన్నారు.

## మ్యానిఫెస్టోను అమలు చేయండి..

ఎదులాపురం, అక్టోబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని.. డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు కూడా పరిష్కారం అవుతాయనే ఆశతో ఎదురు చూస్తున్నామని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ హాన్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు నివేదిన చేసినప్పటికీ కనీస స్పందన లేదన్నారు. కాగా.. నిరసన కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ఈనెల 28వ తేదీ నుంచి అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్లకు టీపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించామన్నారు. జిల్లా స్థాయిలో నవంబర్ 5వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో నవంబర్ 23 హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునించారు.

### పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

భైంసా, అక్టోబర్ 22 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో పాఠశాలలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్, రాజేశ్వర్, రాంనరేశ్, జస్వాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బార్డర్ మీటింగ్‌లో పాల్గొన్న ఎస్పీ

ఎదులాపురం, అక్టోబర్ 22 : మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మంగళవారం యావత్మాల్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బార్డర్ మీటింగ్‌లో ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సమావేశం యావత్‌మాల్ జిల్లా కలెక్టర్ పంకజ్ ఆశీయ, జిల్లా ఎస్పీ కుమార్ చింతా ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలు, సిబ్బంది ఏర్పాటు వివరాలపై చర్చించారు. జిల్లాలో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వివరాలు తెలియజేశారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 22 : బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో బాల్యవివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. తండాలు, గూడలు, గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాల తరహాలో బాల కార్మికులకు విముక్తి కలిగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. 1098 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, సీడబ్ల్యూసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సోయాబీన్ కొనుగోలు నిలిపివేత

బోథ్, అక్టోబర్ 22 : బోథ్ మార్కెట్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు సోయాబీన్ కొనుగోలు నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ వారు రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపారని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

జైనథ్/బేల అక్టోబర్ 22 : జైనథ్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు, బేలలోని ఎంపీడీవో కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, తహసీల్దార్ శ్యాం సుందర్, ఎంపీడీవో వెంకట్‌రావ్, బేల ఎంపీడీవో మహేందర్ కుమార్, తహసీల్దార్ రఘునాథ్ రావ్, బీజేపీ మండలాధ్యక్షుడు దత్తానిక్కం, బీజేవైఎం మండలాధ్యక్షుడు నవీన్ పోత్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కుమ్రం భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

నార్నూర్, అక్టోబర్ 22 : కుమ్రం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ పిలుపునిచ్చారు. నార్నూర్‌లో ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం కుమ్రం భీం 84వ వర్ధంతిని నిర్వహించారు. కుమ్రం భీం విగ్రహం వద్ద సంప్రదాయ పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాందేవ్ పుణ్యక్షేత్రం నుంచి కుమ్రం భీం కాంప్లెక్స్ వరకు జై ఆదివాసీ నినాదాలతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు మడావి మాన్కు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగోరావ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గుపటేల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావు, డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాది రావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పుసం ఇస్రూ, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు రూప్‌దేవ్, ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు పుష్పరాణి, జై భారత్ జిల్లా కోఆర్డినేటర్ దీపక్, ఆదివాసీ నాయకులు, గ్రామల పటేళ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కుమ్రం భీంను స్ఫూర్తిగా తీసుకోవాలి**

కుమ్రం భీంను స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్‌నాయక్, సహకార సంఘం చైర్మన్ సురేశ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఉన్నారు.

## పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను ఇవ్వాలి

ఎదులాపురం, అక్టోబర్ 22 : పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర పిలుపు మేరకు కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం కార్మిక శాఖ అధికారి వినోద్ కుమార్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎస్కే ఉస్మాన్, సహ కార్యదర్శి కీర్తి రమణ, కార్యదర్శి నగేశ్, ఇచ్చోడ మండల కార్యదర్శి గంగయ్య , బోథ్ మండల కార్యదర్శి అనప చందు పాల్గొన్నారు.

## హాస్టల్ నుంచి గోడదూకి పారిపోయిన విద్యార్థులు

**సీసీ ఫుటేజీ ఆధారంగా ఆచూకీ లభ్యం**

భైంసా, అక్టోబర్ 22 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం నుంచి మంగళవారం ఉదయం నలుగురు విద్యార్థులు పారిపోయారు. అనంతరం ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. హాస్టల్‌లో ఉంటున్న చరణ్, కేశవ్, రాకేశ్, ఈశ్వర్‌లు గొడవపడ్డారు. దీంతో మంగళవారం ఉదయం హాస్టల్ గోడ దూకి అందరూ పారిపోయారు. విషయం తెలుసుకున్న వార్డెన్ నగేశ్ తల్లిదండ్రులకు తెలపడంతో భైంసాలోని హాస్టల్‌కు చేరుకుని వార్డెన్‌ను నిలదీశారు. దీంతో సమాచారం అందుకున్న పట్టణ సీఐ గోపీనాథ్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వార్డెన్ నగేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీ ఆధారంగా విద్యార్థుల కోసం గాలింపు చేపట్టారు. పల్సితండాలో విద్యార్థుల ఆచూకీ లభ్యం కాగా వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్సీ వసతి గృహ అధికారి రాజేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు విద్యార్థులను అప్పజెప్పారు.

## మోటారు పంపు స్టాటర్ దొంగతనం

కుంటాల, అక్టోబర్ 22 : కుంటాల అనుబంధ తండా రోడ్డు వైపు గల వన్ హెచ్‌పీ మోటారు పంపు స్టార్టర్‌ను సోమవారం రాత్రి వైర్లు కత్తిరించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు. ప్రభుత్వ నర్సరీ, ఎస్సీ కాలనీలో ఉన్న బోర్ బావికి నీటిని సరఫరా చేయడానికి ఉపయోగిస్తారు. స్టార్టర్‌ను బిగించిన వారం రోజులకి అపహరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తా

ముథోల్, అక్టోబర్ 22 : విద్యాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య, ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రమేశ్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, క్యాషియర్ సాయినాథ్, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సుదర్శన్, నాయకులు, వీడీసీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి**

ముథోల్‌లో సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కురుస్తున్న వర్షాలకు పంట తడిసి నష్టపోతున్నామని వాపోయారు. సానకూలంగా స్పందించి ఎమ్మెల్యే రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతామని చెప్పినట్లు తెలిపారు. ఇక్కడ ముథోల్ రైతులు ఉన్నారు.

## ఇంటి వద్దనే ప్రసవం

ఇచ్చోడ, అక్టోబర్ 22: సిరికొండ మండలం రిమ్మ గ్రామానికి చెందిన గర్భిణి సోని పురిటి నొప్పులతో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ఆమెకు పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఇంటి వద్దనే ఆడబిడ్డకు జన్మనిచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డను అంబులెన్స్‌లో పిట్టబొంగురం పీహెచ్‌సీకి తరలించామని ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ రాజేశ్ తెలిపారు.

## చేపపిల్లలను పంపిణీ చేసిన అధికారులు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 22: గంగన్నపేట్, ఎల్లమ్మ చెరువులో మంగళవారం మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వం అందించిన రాయితీ చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు సురేశ్ చౌహాన్, రాధాకృష్ణ, ఈవో శంకర్, లక్కారం పంచాయతీ కార్యదర్శి జగదీశ్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22: నిర్మల్‌లోని వెంకటాపూర్ కాలనీ నుంచి నిస్సి చర్చి తండా వరకు రూ. కోటి 20 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

ఇచ్చోడ, అక్టోబర్ 22: కుమ్రం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. మంగళవారం సిరిచెల్మ గ్రామంలో ఆదివాసీ సంఘాల నాయకులు కుమ్రం భీం 84వ వర్ధంతి నిర్వహించారు. కొలంగూడ పటేల్ ఇంటి నుంచి భారీ ర్యాలీ తీశారు. అనంతరం కుమ్రం భీం విగ్రహానికి, సూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

ఎదులాపురం, అక్టోబర్ 22 : ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం కచికంటి, చిట్యాల్‌బోరి, పందిరిలొద్ది, చించుఘాట్, లోకారి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు.

## వానల్‌పాడ్‌లో కార్డన్‌సెర్చ్

భైంసాటౌన్, అక్టోబర్ 22 : వానల్‌పాడ్ గ్రామంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 72 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ నైలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22 :విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఎంతో అవసరమని శ్రీనివాస్ శెట్టి అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని వాసవి వరల్డ్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మౌనిక సైబర్ సెక్యూరిటీ దాని వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ జగదీశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజాయ్‌సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆకాల వర్షంతో నేలకొరిగిన పంట

ఖానాపూర్/సోన్/నార్నూర్, అక్టోబర్ 22: నిర్మల్ జిల్లా ఖానాపూర్, నిర్మల్, సోన్, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల వరి పంట నేలకొరిగింది. మొక్కజొన్న, సోయాబీన్ పంటలు చేతికి రావడంతో కల్లాల్లో అరబెడుతున్న సమయంలో ఈ వర్షం కురవడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## జీవో 29 రద్దు చేయాలి

నేరడిగొండ, అక్టోబర్ 22 : జీవో 29 వెంటనే రద్దు చేసి పాత జీవో ప్రకారమే గ్రూపు-1 ఉద్యోగాలు భర్తీ చేయాలని లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నేరడిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉద్యోగ ఉపాధి రంగాల్లో తెరచాటు జీవోలు తీసుకొస్తుందని పేర్కొన్నారు. గ్రూపు-1 నోటిఫికేషన్‌తో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు అన్యాయం చేస్తూ జీవో 29 తీసుకువచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే జీవో 29ని రద్దు చేయాలని లేనిచో పెద్ద ఎత్తున గిరిజనులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## యువత మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దు



మారథన్ రన్ విజయకేతాన్ని చూపిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్ బృందం

దస్తురాబాద్(కడెం), అక్టోబర్22 : యువత మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఖానాపూర్ నుంచి కడెం వరకు మంగళవారం డాక్టర్ కిరణ్ కుమార్ బృందం మారథన్ రన్ నిర్వహించారు. ఖానాపూర్ నుంచి మారథన్ రన్ ప్రారంభించి 21.35 కిలో మీటర్ల దూరాన్ని 2.38 గంటలలో కడెం వరకు చేరుకున్నారు. లక్ష్యాన్ని చేరుకొని డాక్టర్ కిరణ్ కుమార్ బృందం మారథన్ రన్ విజయకేతానాన్ని చూపించారు. కార్యక్రమంలో మారథన్ రన్ బృందం సభ్యులు రాపల్లి రాజ్ యాదవ్, నువ్వుల రాజేందర్, అశోక్, నాగరాజు గౌడ్, వెంకటరమణ, ముషారఫ్ పాల్గొన్నారు.

## ఎనిమిది మంది అరెస్టు

ఎదులాపురం, అక్టోబర్ 22 : మావల ఎస్టీ హాస్టల్‌కు చెందిన రాథోడ్ జితేందర్ సెప్టెంబర్ 21వ తేదీన పురుగుల మందు తాగి మృతి చెందాడు. కాగా అదే రోజు మావల పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. మృతికి సరియైన కారణాలు తెలుసుకోకుండా హత్య చేసినట్లు కేసును పక్కదారి పట్టించేందుకు నార్నూర్ మండలం చోర్‌గావ్ గ్రామానికి చెందిన మృతుని బంధువులు, కొంతమంది విద్యార్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. స్థానిక బస్టాండ్ ఎదుట రోడ్డుపై గంటల తరబడి ధర్నా చేసి ప్రజాశాంతికి భంగం కలిగించారు. అలాగే పోలీసుల విధులకు ఆటంకం పరిచారు. ఈ కేసులో ఎనిమిది మందిని మంగళవారం అరెస్టు చేసి నోటీసులు ఇవ్వడం జరిగిందని టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్‌రావు తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎదులాపురం, అక్టోబర్ 22 : కిన్వాట్ తాలూకా లింగి గ్రామానికి చెందిన రావునే సంతోష్(27) సోమవారం మాండ్వి సమీపంలో ఆగి ఉన్న టాటా ఏసీ వాహనాన్ని ద్విచక్రవాహనంతో ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు సమీప దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకువచ్చారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఈ మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎదులాపురం, అక్టోబర్ 22 : ఉమ్మర్ ఖేడ్ టాక్లి గ్రామానికి చెందిన హరల్ బాలాజీ(32) సోమవారం పురుగుల మందు తాగి ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తీసుకువచ్చారు. ఐదు సంవత్సరాలుగా మద్యానికి బానిసైన బాలాజీ తరచుగా భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే సోమవారం సైతం భార్యను మద్యానికి డబ్బులు అడిగాడు. దీంతో వారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భర్త పురుగుల మందు తాగాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ అర్ధ రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న గజానన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ ముకుందరావ్ తెలిపారు.

## మట్కా నిర్వాహకులు అరెస్ట్

బేల, అక్టోబర్ 22 : బేల శివారులో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం దాడి నిర్వహించగా ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాధిక తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజులుగా మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రాగా పోలీసు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులతో పాటు మట్కా ఆడడానికి వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5390తో నగదు పాటు మట్కా చిట్టిలను సీజ్ చేసినట్లు తెలిపారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, అక్టోబర్ 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన మెస్రం రాజేశ్వర్ (20) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు దవాఖానలో వైద్యం అందించిన ఆరోగ్యం కుదుటపడలేదు. రాజేశ్వర్ ఈ నెల 20న వడగాం గ్రామానికి చెందిన దగ్గరి బంధువుల ఇంటికి వచ్చాడు. 21న వడగాం సమీపంలోని గల పాటగూడ శివారులోని ఓ వ్యవసాయ చేనుకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి భీంరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడి..

తాంసి, అక్టోబర్ 22 : పొన్నారి గ్రామానికి చెందిన గుమ్ముల దేవన్న(38) హస్నాపూర్ శివారు బ్రిడ్జి నంబర్ 188 వద్ద రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురికి తరలించారు. చివరిసారిగా సెల్ఫీ వీడియోలో దేవన్న తను మద్యానికి బానిసయ్యానని అందరూ అంటున్నారని, మద్యానికి బానిస కాలేదని ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని, అరగంటలో చనిపోతున్నట్లు సెల్ఫీ వీడియోలో చివరిగా మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో తిరిగింది. మృతుడి భార్య, కొడుకు ఉన్నారు.

## గ్రామస్తులు ఐక్యమత్యంతో ఉండాలి

ముథోల్, అక్టోబర్ 22 : గ్రామస్తులు ఐక్యమత్యంతో ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్డీవో కోమల్ రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. మంగళవారం బోరిగాం గ్రామంలో మూడు రోజుల క్రితం ప్రభుత్వ భూములు వివాదస్పదంగా మారాయి. దీంతో దళిత సంఘాలు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 249 సర్వే నంబర్‌లో 20 ఎకరాల భూమిలో అక్రమాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమిలో బుద్ధవిహార్ లుంబిని వనం కోసం ఎకరం భూమి కేటాయించారని ఫిర్యాదు ద్వారా అధికారులు తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన దృష్ట్యా మంగళవారం భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, సీఐ మల్లేశ్ గ్రామానికి చేరుకొని సమస్యను తెలుసుకొని చర్చలు జరిపారు. తెల్ల కల్లు, మద్యం అమ్మకాలతో పాటు వీడీసీని సైతం నిషేధించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా కలిసి మెలిసి ఉండాలని కోరారు. దీంతో గొడవ సద్దుమణిగింది. సమావేశంలో తహసీల్దార్‌శ్రీకాంత్, ఎస్ఐ సాయికృష్ణ పాల్గొన్నారు.